తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | బుధవారం 16 సెప్టెంబర్ 2026

యువత స్వశక్తితో ఎదగాలి

తొలివెలుగు, చిట్యాల : యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురుచూడకుండా స్వశక్తితో స్వయం ఉపాధి రంగాల్లో ఎదగాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పిలుపునిచ్చారు. చిట్యాల పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు కౌన్సిలర్ ఏర్పుల పరమేష్ నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ బ్రిక్స్ తయారీ యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యాపార యూనిట్ నెలకొల్పి తాను ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పిస్తున్న పరమేష్‌ను అభినందించారు. స్వయం ఉపాధి వైపు అడుగులు వేసే యువతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ ఛైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మీ సైదులు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ, కౌన్సిలర్లు నిమ్మనగోటి శ్రీనివాస్, జేరిపోతుల సత్యనారాయణ, నాయకులు బొబ్బల రామ్‌రెడ్డి, షేక్ అజీమ్, ఎస్.కె.ఇబ్రహీం, జగిని బిక్షంరెడ్డి పాల్గొన్నారు.

వాడవాడలా నిలిచిన గణనాథుడు

భూదాన్ పోచంపల్లిలో ఘనంగా వినాయక చవితి

ఎన్‌వైఏ, టై అండ్ డై ఆధ్వర్యంలో పూజలు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పురపాలక కేంద్రంతో పాటు ప్రతి వీధిలోనూ ప్రత్యేక పందిళ్లు వేసి గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పండుగ వేళ పత్రి, పూలు, పండ్లు, మిఠాయిల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటడంతో సామాన్యులపై తీవ్ర ఆర్థిక భారం పడింది. స్థానిక ఎన్‌వైఏ యువజన సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద సంఘ అధ్యక్షుడు మక్తల వెంకటేష్ నేతృత్వంలో తొలి పూజ నిర్వహించారు. టై అండ్ డై అసోసియేషన్ మండపం వద్ద చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో గునీగంటి రమేష్ గౌడ్, కుడికాల రామనరసింహ, కీర్తి సంజీవ, శెట్టి శ్రీనివాస్, వంగూరు పాండు, కర్నాటి బాలరాజు, ఈపూరి ముత్యాలు, గంజి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో భారీ చోరీ: రూ.10 లక్షల సొత్తు మాయం

బావి వద్దకు వెళ్లిన సమయంలో దొంగతనం

పోలీసులకు ఫిర్యాదు చేసిన మారయ్య

తొలివెలుగు, చిట్యాల : చిట్యాల పురపాలక కేంద్రంలో పట్టపగలే దొంగతనం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన పెద్దవోని మారయ్య ఈ నెల 12న ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది.

బీరువాలో ఉన్న 6 తులాల బంగారం, 6 తులాల వెండితో పాటు రూ.30 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ధ్యాన్ ఫౌండేషన్ గోశాల పరిశీలన

రైతులకు వర్మీ కంపోస్ట్ అందించేలా చర్యలు

గోశాల నిర్వాహకులతో డీఏఓ, ఆత్మ ఛైర్మన్ చర్చలు

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని ధ్యాన్ ఫౌండేషన్ గోశాలను మంగళవారం ఆత్మ కమిటీ ఛైర్మన్ ఎనగండ్ల సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వెంకటరమణారెడ్డి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకురాలు పూనం కపూర్‌తో మాట్లాడిన అధికారులు, రైతులకు వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీకి అవసరమైన పేడను సేకరించి అందించేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవాసింగ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బల్ల హరీష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బల్ల మహేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

22–ఏ సవరణపై తహసీల్దార్‌కు వినతి

బాధిత ఆస్తులను జాబితా నుంచి తొలగించాలి

సరూర్‌నగర్ తహసీల్దార్‌కు ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి వినతిపత్రం

తొలివెలుగు, సరూర్‌నగర్ : గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని నివాస ప్రాంతాల్లో 22–ఏ నిషేధిత జాబితా నుంచి అర్హత ఉన్న ఆస్తులను తొలగించాలని కోరుతూ సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం బీజేపీ నాయకుడు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో స్థానిక ప్రజలు, నాయకులు తహసీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పన్నులు చెల్లిస్తూ నివసిస్తున్న వారి ఆస్తులు 22–ఏ జాబితాలో ఉండటం వల్ల రిజిస్ట్రేషన్లు, అమ్మకాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించి అర్హమైన ఆస్తులను తొలగించేలా ఉన్నతాధికారులకు నివేదించాలని, నిషేధిత ప్రాంతాలపై అధికారిక స్కెచ్ అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, నాయకులు రఘునందన్ జోషి, వంశీ గంగపుత్ర, టింకు, గిరీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈలకు ఇంజనీర్స్ డే సన్మానం

వివేకానంద్, చంద్రశేఖర్‌లను సత్కరించిన నేతలు

ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై హర్షం

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండల కేంద్రంలో మంగళవారం ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ వివేకానంద్, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్‌లను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయించి రాజాపేట మండలాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపినందుకు హౌసింగ్ ఏఈ వివేకానంద్‌ను అభినందించారు. అనంతరం రాజపేట సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ ఏఈ చంద్రశేఖర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నమిలే మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్ కుమార్, చల్లూరు సర్పంచ్ భీమగాని రూప–బాలనర్సయ్య గౌడ్, నాయకులు పాండవుల భానుప్రకాష్, పారుపల్లి రాంరెడ్డి, కోరే మల్లయ్య, కోరే వీరయ్య, బస్వరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిరి మహాలక్ష్మి ఇన్‌ఫ్రాలో 'చవితి' వేడుకలు

ప్రత్యేక పూజలు చేసిన వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

నైవేద్యాల సమర్పణ.. ప్రసాదం పంపిణీ



తొలివెలుగు, నాగోల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగోల్‌లోని సిరి మహాలక్ష్మి ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. సంస్థ ఛైర్మన్ కల్లెం వెంకటేశ్వర్ రెడ్డి, రాజేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న ఉద్యోగులు, సిబ్బంది, కష్టమర్లు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కార్యక్రమంలో హనీమీ రెడ్డి, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు.

కుంగ్‌ఫు పోటీల్లో మెడళ్ల పంట

జాతీయ స్థాయిలో 'హయత్‌నగర్ టైగర్స్' సత్తా

35 పతకాలు సాధించిన విద్యార్థులు

తొలివెలుగు, ఎల్‌బీనగర్ : భువనగిరిలోని శ్రీసాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 5వ జాతీయ కుంగ్‌ఫు, కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్–2026లో హయత్‌నగర్ టైగర్స్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ చాటారు. మాస్టర్ మునుకుంట్ల శివ గౌడ్ పర్యవేక్షణలో పోటీల్లో పాల్గొన్న 35 మంది విద్యార్థులూ పతకాలు కైవసం చేసుకున్నారు. ఇందులో 20 స్వర్ణాలు, 8 రజతాలు, 7 కాంస్య పతకాలు ఉన్నాయి. అండర్–12 బాలికల స్పారింగ్ విభాగంలో వి.శ్రీనిధి గ్రాండ్ ఛాంపియన్‌గా నిలిచింది. క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంచుతాయని మాస్టర్ శివ గౌడ్ అన్నారు. విజేతలను అకాడమీ ప్రతినిధులు, తల్లిదండ్రులు అభినందించారు.

విగ్రహాన్ని అడ్డుకుంటే సహించేది లేదు

గుండోజి రంగదాసు పోస్టర్లను ఆవిష్కరించిన బాలకృష్ణ

నిందితులపై చర్యలు తీసుకోవాలని సీఐకి ఫిర్యాదు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : రంగారెడ్డి జిల్లా బందరావిరాల గ్రామంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన గుండోజి రంగదాసు పంతులు విగ్రహాన్ని కులం పేరిట అడ్డుకుంటే సహించేది లేదని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని దేశముఖి గ్రామంలో మంగళవారం నాయి బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ విద్యా వ్యవస్థ కోసం జీవితాంతం సేవ చేసిన వ్యక్తి విగ్రహాన్ని స్వార్థ రాజకీయ కుట్రలతో అడ్డుకోవడం దారుణమన్నారు. అనంతరం విగ్రహావిష్కరణను అడ్డుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుండాల రాజారాం, మండల అధ్యక్షుడు రంగయ్య, నాయకులు లక్ష్మణ్, సాయికృష్ణ, శంకర్, మల్లేష్, శీను, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజాపేటలో పండుగ సాయన్న విగ్రహం

ఏర్పాట్లకు ప్రత్యేక కమిటీ నియామకం

ఏకగ్రీవంగా ఎంపిక చేసిన ముదిరాజ్ సంఘం

తొలివెలుగు, రాజాపేట : రాజపేటలో త్వరలోనే పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముదిరాజ్ కుల సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విగ్రహ ఏర్పాటు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షుడిగా మేడమైన శివరాములు (సోమారం), ఉపాధ్యక్షుడిగా పులి రాజు (సర్పంచ్, నమిల), సభ్యులుగా మంత్రాల సుమన్ (బేగంపేట), ఉప్పరి నరేష్ (కొండ్రెడ్‌చెరువు సర్పంచ్), ఇండ్ల రాజయ్య (లక్ష్మక్కపల్లి సర్పంచ్) తదితరులను ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడు పులి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు కొప్పుల హరినాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాపాక తిరుపతి, పిట్టల జయరాములు, ముత్యం రాజుతో పాటు ప్రతి గ్రామం నుండి ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

– వినాయక మండపంలో వీరేశం ప్రత్యేక పూజలు
– ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపు

తొలివెలుగు, చిట్యాల : ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మంగళవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ, కౌన్సిలర్లు కుక్కల మోహన్, కోనేటి ఎల్లయ్య, జేరిపోతుల సత్యనారాయణ, నాయకులు దేశపాక రాజేష్, కొసనం అశోక్, ఎస్.కె.ఇబ్రహీం, కంభంపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి: కౌన్సిలర్ యాదమ్మ

– చిట్యాలలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
– మూడో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

తొలివెలుగు, చిట్యాల : చిట్యాల మున్సిపాలిటీలోని మూడో వార్డు సమగ్రాభివృద్ధికి శ్రమిస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ గాలి యాదమ్మ లింగయ్య తెలిపారు. వార్డులో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో వార్డులో మౌలిక వసతులు వేగంగా కల్పిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలోనే మూడో వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏర్పుల పరమేష్, కోనేటి ఎల్లయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా భక్తిపారవశ్యం.. కొలువుదీరిన లంబోధరుడు

రాజాపేటలో నేత్రపర్వంగా చవితి వేడుకలు
సాయి మందిరంలో 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండల వ్యాప్తంగా వినాయక చవితి పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పత్రులు, ఫలాలతో స్వామివారికి శ్రద్ధాభక్తులతో పూజలు చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని గ్రామాల్లోని ప్రత్యేక మండపాల్లో విఘ్నేశ్వరుని ప్రతిమలను చర ప్రతిష్ఠ చేశారు. రాజాపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మంది రంలో 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిం చేందుకు స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణల మధ్య కొలువుదీర్చారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు బెజగం శ్రీనివాసులు–రాజేశ్వరి దంపతుల సౌజన్యంతో అందమైన విగ్రహాన్ని స్వగృహం నుంచి భజన పాటల మధ్య మందిరానికి తరలించారు. ఈ నెల 14 నుంచి 24 వరకు నిత్య పూజలు, భజనలు నిర్వహిం చను న్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, భక్తులు పాల్గొన్నారు

లిఫ్ట్ గుంతలో పడి పెయింటర్ మృతి

ప్రగతినగర్లో నిర్మాణ భవనంలో విషాదం
బిల్డర్ నిర్లక్ష్యమే కారణమని కుమారుడి ఫిర్యాదు

తొలివెలుగు, హయత్నగర్ : పెయింటింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం వదిలిన ఖాళీ ప్రదేశంలో పడి ఓ పెయింటర్ మృతిచెందాడు. హయత్నగర్ పోలీ సుల వివరాల ప్రకారం.. సుమారు 30 ఏళ్లుగా పెయింటర్గా పనిచేస్తున్న చింతలపూడి వెంకటేశ్వరరావు (55) మంగళవారం ఉదయం తన కుమారుడితో కలిసి ప్రగతినగర్లోని రాజధాని బ్యాంక్ పెంట్హౌస్లో పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా కాలు జారి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. గమనించిన కుమారుడు వెంటనే అంబులెన్స్కు సమాచారం అందించినా, అది వచ్చేలోపే వెంకటేశ్వరరావు మృతిచెందాడు. భవన నిర్మాణ సమయంలో తగిన భద్రతా చర్యలు చేపట్టకపోవడం, లిఫ్ట్ గుంతను మూసివేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, బిల్డర్ మల్లెల సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హయత్నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు మంచి అవకాశం

రాజాపేటలో ఎస్జీఎఫ్ మండల స్థాయి ఎంపికలు
అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు
వివరాలు వెల్లడించిన ఎంఈఓ కే. మదన్మోహన్

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గురుకులం) ఆవరణలో ఈ నెల 18, 19 తేదీల్లో 70వ ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కే. మదన్మోహన్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపికల వివరాలను వెల్లడించారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18న బాలికలకు, 19న బాలురకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అండర్–14 క్రీడాకారులు 2013 జనవరి 1 తర్వాత, అండర్–17 క్రీడాకారులు 2010 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. కబడ్డీలో అండర్–14 బాలురకు 51 కిలోలు, బాలికలకు 48 కిలోలు, అండర్–17 బాలబాలికలకు 55 కిలోల బరువు పరిమితి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు సంబంధిత హెచ్ఎం ఆమోదించిన జాబితాతో ఉదయం 9 గంటలకు ఎంపికల వేదిక వద్ద రిపోర్టు చేయాలని ఎంఈఓ సూచించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దూది వెంకటాపురం ఉన్నత పాఠశాల పీడీ మధు (9848584735)ను సంప్రదించాలని ఎంఈఓ తెలిపారు.

మట్టి విగ్రహాల పంపిణీ అభినందనీయం: సీపీ సజ్జనార్

నంగునూరు రాజును ప్రశంసించిన హైదరాబాద్ సీపీ

తొలివెలుగు, రాజాపేట: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన రాజాపేటకు చెందిన శ్రీ వెంకటేశ్వర మెడికల్ షాప్ నిర్వాహకుడు నంగునూరు సోమయ్య రాజును హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. రాజాపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించే వినాయక విగ్రహం కొనుగోలు కోసం హైదరాబాద్లోని ఈసీఐఎల్కు వెళ్లిన సమయంలో సీపీ సజ్జనార్ను నంగునూరు రాజు కలిశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేసిన విషయాన్ని తెలుసుకున్న సీపీ, రాజును ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో 11 రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలు, విశేషాల గురించి అడిగి తెలుసుకుని, ఉత్సవ నిర్వాహకులను అభినందించారు.

తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

సెప్టెంబర్ 17న ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించాలి

ప్రతి వీధిలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలి: డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్‌లో బీజేపీ నాయకుల డిమాండ్

తొలివెలుగు, చౌటుప్పల్ : తెలంగాణ విమోచన దినమైన సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని పద్మ వంశీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి 1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించిందని గంగిడి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. నాటి ఉద్యమంలో ఎందరో త్యాగధనులు, మహనీయులు చేసిన పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ,

ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ తరఫున డిమాండ్ చేశారు.ఎందరో త్యాగధనుల పోరాటాలు, మహనీయుల సంకల్పం ఫలితంగా సాధించిన విముక్తి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు తమ తమ వీధుల్లో త్రివర్ణ పతాకాలను ఎగురవేసి విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కడారి కల్పన, ఐలయ్య యాదవ్, గ్రామీణ అధ్యక్షుడు కైరంకొండ అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూదల బిక్షం గౌడ్, ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్, కౌన్సిలర్లు పోలపల్లి లక్ష్మీ, ముత్తయ్య, సీనియర్ నాయకులు రమణ, గోని శంకర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుల మల్లేశం, ముత్యాల భూపాల్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, భవనం మధుసూదన్‌రెడ్డి, రెక్కల సుధాకర్‌రెడ్డి, కట్ట కృష్ణ, సర్పంచులు తంగళ్ల వెంకటేశం, నందగిరి వెంకటేశంగౌడ్, బత్తుల జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పాలిట వరం.. సీఎం సహాయనిధి

అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా

రూ.55 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్‌గౌడ్

తొలివెలుగు, చౌటుప్పల్: అనారోగ్యాల బారిన పడిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన ఇద్దరు అనారోగ్య బాధితులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం సర్పంచ్ అందజేశారు. గ్రామానికి చెందిన గుడ్డేటి మమతకు రూ.34 వేలు, రావిరాల అంజయ్యకు రూ.21 వేల చొప్పున మంజూరైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం సహాయనిధి చెక్కుల మంజూరుకు సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, ఆదిమూలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో తెలంగాణ ముందంజ

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కేతేపల్లిలో కార్డులు అందజేసిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

తొలివెలుగు, కేతేపల్లి: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. కేతేపల్లి మండల కేంద్రంలోని జ్యోతి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని వేముల వీరేశం పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని ఆయన అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో డీజేలపై నిషేధం

బాజాభజంత్రీల ఊరేగింపులకే అనుమతి: ఎస్ఐ తక్కియుద్దీన్

రాత్రి 10 గంటల తర్వాత మైకులకు అనుమతి లేదు

మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

తొలివెలుగు, రాజాపేట : వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా డీజేల వినియోగంపై పూర్తి నిషేధం విధించినట్లు రాజాపేట ఎస్ఐ తక్కియుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత మైకులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా కోసం సంబంధిత పోలీసు, విద్యుత్ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రాత్రివేళల్లో మండపాల వద్ద కమిటీ సభ్యులు బాధ్యతగా ఉండి భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జనం సమయాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలని, పోలీసులు సూచించిన మార్గాల్లోనే గణేష్ విగ్రహాల ఊరేగింపులు నిర్వహించాలని తెలిపారు. ఊరేగింపుల్లో బాజాభజంత్రీలకు మాత్రమే అనుమతి ఉంటుందని, డీజేల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ తేల్చిచెప్పారు. నిబంధనలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అంకిరెడ్డిగూడెంలో ఓటర్ల జాబితా సవరణ

94 మంది ఓటర్ల పేర్ల తొలగింపు

274 మంది ఓటర్ల వివరాల సవరణ

ప్రత్యేక సమగ్ర సవరణపై అధికారుల పరిశీలన



తొలివెలుగు, చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, సవరణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంఆర్ఓ ఎస్. సూరయ్య ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ సమక్షంలో కార్యక్రమం కొనసాగింది. గ్రామంలో మొత్తం 1,427 మంది ఓటర్లు ఉండగా, సవరణ ప్రక్రియలో 94 మంది ఓటర్ల పేర్లు తొలగించిన అనంతరం ప్రస్తుతం 1,333 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గ్రామంలో రెండు ఎన్నికల బూత్‌ల పరిధిలో ఓటర్ల జాబితాను పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా 274 మంది ఓటర్ల వివరాల్లో సవరణలు అవసరమైనట్లు గుర్తించి, సంబంధిత ఓటర్లు బీఎల్ఓలు సూచించిన ఆధారాలను సమర్పించి తమ వివరాలను సవరించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్లందరూ తమ పేర్లు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకుని తప్పులు ఉంటే సంబంధిత ఆధారాలతో సవరణ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారి వినయ్, బీఎల్ఓ బొల్లు అండాలు, అంగన్‌వాడీ టీచర్ నల్ల జయప్రద, గ్రామ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు

తొలివెలుగు, నకిరేకల్ : కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు వడ్డె ప్రభాకర్, విద్యా కమిటీ ఛైర్మన్ కందుకూరి నాగయ్యతో పాటు వస్కుల వెంకన్న, వడ్డె ఎల్లేష్, వడ్డె రాంబాబు, వడ్డె మాణిక్యం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన క్యాంపు కార్యాలయంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.